# సంకల్పం సగం బలం

'శకుంతల పరిస్థితి అసలు బాగాలేదు. ఉన్నపళంగా గుంటూరు రావాలి రాఘవా, నా వల్లగావటం లేదు. ఎట్టా మేనేజ్ చేయాలో సలహా చెప్పేవాళ్ళూ లేరు. వెంటనే బయల్దేరు. రాత్రి బస్‌కు వచ్చెయ్' సెల్‌ఫోన్ ఆగింది.

శంకరం బావ కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నట్టు నాకు తెలుస్తూనే ఉంది. శకుంతల నాకు ఒక్కగానొక్క చెల్లెలు.

మనసంతా కలచినట్టైంది. ఏమైంది శకుంతలకు? వివరాలు తెలీవు. వారం క్రితం స్వాతి కూడా ఇదే ధోరణిలో ఫోన్‌లో మాట్లాడి 'నువ్వోసారి రావాలి మావయ్యా. అమ్మ విషయం చెబితే తెలిసేది కాదు' అన్నది.

మధ్యతరగతి సంసారాల్లో మామూలు సమస్యలే ఎక్కువ. దిగలాగుడు మనస్తత్వంతో అవస్థలు కొనితెచ్చుకుంటారు. ఇలాంటి ఆలోచనలతో, రచయిత తెలివితేటలతో పెద్ద సీరియస్‌గా తీసుకోలేదు నేను.

ఇవ్వాళ శంకరం బావ ఫోన్‌లో మాటలు వేరు. మా బావంటే మనిషి నిండుకుండ. తొణకడు. ఇద్దరు కొడుకులూ. ఇద్దరు కూతుళ్ళతో సంసారాన్ని ఒక వొడ్డుకు చేర్చటానికి చాలా మునుగీతలు నేర్చుకున్నవాడు. గవర్నమెంట్ ఉద్యోగే అయినా, నిఖార్సయిన మనిషిగా గెలుచుకొచ్చాడు. రిటైరయి నాలుగేళ్ళయింది. కొడుకులిద్దరూ ఎవరిఉద్యోగాలు వాళ్ళు చేసుకుంటున్నారు. పెళ్ళిళ్ళూ అయినై. భార్యలే ఉద్యోగినులే. పెద్ద పెద్ద రాబడులేమీ లేకపోయినా, ఎవరి సంసారాలు వాళ్ళు చేసుకుంటున్నారు. గుంటూరులోనే విడివిడిగా ఇళ్ళు తీసుకుని ఉంటున్నారు. ఈ ఏర్పాటు కూడా శంకరం బావ తనకు తానుగా ఆలోచించి చేసినదే. ఎవరి స్వేచ్ఛ వారికుండాలి అనే భావన ఆయనది. శని, ఆదివారాలూ, సెలవురోజుల్లో వస్తూపోతూ వుంటారు. శకుంతలకి ఈ ఏర్పాటు సుతరామూ ఇష్టంలేదు. ఆమె మనస్సు బాగానే నొచ్చుకుంది.

నా పెద్ద మేనకోడలు ఇంద్రాణి.జ బి.ఏ చివరి ఏడు చదువుతుండగా ఆ సంఘటన జరిగింది. శంకరం బావకీ, శకుంతలకీ కూడా అది ఆశనిపాతమే అయింది.

ఇంద్రాణి ఆలోచనలతో మనసు వికలమయింది నాకు. నా భార్య శర్వాణి వచ్చి పక్కగా నిలిచింది. అంత పెద్దగా ఆలోచించాల్సిందేం వుంది. వెళ్లిరండి. అన్నీ తెలుస్తయ్' అన్నది.

రాత్రి భోజనాల దగ్గర కూడా ఈవిషయమే మా అందరి మధ్యనా నలిగింది. నా కొడుకు సూరీ, కూతురు సుజాతా కూడా తమకు తోచిన మాటలు తామూ మాట్లాడారు. చివరికి 'అత్తయ్యకేం ప్రాబ్లెమ్ వుండదులే నాన్నా' అని బరోసా పలికాడు సూరి. వాడు సాఫ్ట్‌వేర్ ఇంజినీరు!

'ఇంద్రాణి వ్యవహారం వల్లనే వదినకి షాక్ తగిలింది. అంతకుమించి ఏం వుండదు లెండి' అని శర్వాణి కూడా ధైర్యం చెప్పింది. నాకు నా రెండో మేనకోడలు స్వాతీ కళ్లల్లో మెదిలింది. ఆ రాత్రే నేను గుంటూరు బస్ పట్టుకున్నాను.

❖ ❖ ❖

ఏ వెళ్ళేసరికే ఎనిమిది గంటలవుతోంది.

పలకరింపులయినై. శకుంతల కనిపించలేదు.

నన్ను చూసి శంకరం బావ పెద్దబావ సంఘర్షణకి లోనయ్యాడు. మొహం మీద ఓ పక్కన నేను వచ్చానని సంతృప్తీ, మరో పక్కన మనసులోపల గూడుకట్టుకున్న దుఃఖం, మంచంమీద తనపక్కన కూర్చోబెట్టుకుని, చేతిలో చెయ్యివేసీ, కళ్ళల్లో కళ/ళ పెట్టీ అన్నాడు. "నువ్వొచ్చావ్ రాముడూ చాలా బలమొచ్చింది"

నేను ధైర్యం పలుకుతున్నట్టుగా బావ చేతిని నొక్కాను.

శంకరం బావ అప్పగారు, కాఫీ కప్పు చేతికిస్తూ 'ఏవోనయ్యా రామ్మూర్తీ ఈ యింటికేదో శనిపట్టింది. నీ చెల్లెలు మళ్ళీ ఎప్పటికీ లోకంలో కొచ్చేనో ఏమో' అంది.

ఆమెకి ఏం పేరుండేదో గానీ, శకుంతల పెళ్ళి నాటినుండీ మాకావిడ అమ్మమ్మగారే. ఎనభైఏళ్ళ మనిషి, జీవితంలో వీళ్ళే తానుగా బతుకుతోంది. పదహేనో ఏటే తలచెడి ఇక్కడ చేరింది.

అమ్మమ్మ మాటలకి ఏం సమాధానం చెప్పగలను. నేను ఏమన్నా ఆమె బతుకులో ఇంకా ఇంకా వెనక్కి వెళ్ళి చాలా దుఃఖాలూ, నరకాలూ వర్ణించుకొస్తుంది. నాకావిడ మాటలూ, స్వభావమూ తెలుసు. అందుకని నెమ్మదిగా ఫర్వాలేదు లెండి అమ్మమ్మగారూ, అన్నీ సర్దుకుంటయ్' అని మాత్రం అన్నాను.

మరుక్షణం మా బావ కళ్ళల్లోకి చూస్తూ 'శకూ ఎక్కడ?' అన్నాను. కాఫీ ముగిసింది.

బావలేచి పక్కగదిలోకి అడుగువేశాడు – నన్నూ రమ్మన్నట్టు. నేనూ ఆయన అడుగులో అడుగుగా అనుసరించాను. తాను గుమ్మం దగ్గరే నిలబడి, నాకు తోవయిచ్చాడు.

నేను అడుగు అటు వేశాను.

శకుంతల! ఆ గదిలో మంచానికి ఆవల మూలమీద మాసిన గుడ్డల మూటలా ముడుచు క్కూచునుంది.

మానసికంగా అంతో ఇంతో తయారై వున్న వాణ్ణి. హఠాత్తుగా దిగ్భ్రమకేమీ లోను కాలేదు. కానీ కడుపులో బాధా, విచారం ఉంగలు తిరిగినై. అంతఃకరణ గిలగిల్లాడింది. వెళ్ళి మంచం పట్టెమీద కూర్చున్నాను. నాకు అడుగు ఎదురుగా శకూ.

పిచ్చి చూపులు చూస్తోంది శకుంతల. చేతి వేలికి చీరకొంగుని ముడిమీద ముడిగా వేస్తున్నది. వెర్రినవ్వు నవ్వుకుంటోంది. 'అవును... ఆ ఎర్రముండ లేచిపోయిందిరా రాముడన్నయ్యా' అని గట్టు తెగిన నదిలా ఏడుపుని పారించేసింది. నన్ను బాగానే గుర్తుబట్టింది. ఊపిరి పీల్చుకున్నాను.

క్షణాలు గడవకుండానే వెధవ బతుకు, దుర్మార్గపు వెధవ. నేనే దాని శత్రువునంటుందిట. నువ్వు చెప్పరా అన్నయ్యా. నేను దాని అమ్మనా? శత్రువునా? దాన్ని నేనసలు నా అమ్మగా చూసుకున్నానే, నన్ను... నన్ను శత్రువునంటుందా? చంపుతుందిట నన్ను... చంపనీ! రాక్షసిముండ! ఏం నేను చంపలేనా?...' అంటూ ఒక్క ఉదుటున లేచి నిలబడింది.

రెండు చేతులూ విదిల్చి, గుప్పిట బిగపట్టి, పళ్ళు కొరుకుతూ 'దాన్ని... దాన్నీ... దాన్నీ.. పీక పిసికి...' అంటూ నామీదికొచ్చేసి కంఠం పట్టుకుంది.

స్తబ్దుణ్ణయిపోయాను. లోలోపల భయమూ వేసింది. ఆమె చేతుల్ని విదిలించుకోవాలని ప్రయత్నిస్తున్నాను. క్షణంలో ఆమెకి అంతటి బలం ఎలా వచ్చిందో అర్థం కాలేదు. ఇంతలో శంకరం బావ వొక్క అడుగులో దూకి మా ముందు కొచ్చి నిలబడ్డాడు. 'అట్టాగే శకూ.... అట్టాగే.. రానీ దాన్ని.. రానీ. దాని సంగతి చూద్దాం...' అంటూ ఆమెని పొదివిపట్టుకుని, పక్కకు తీసికెళ్ళాడు.

నేను ఊపిరి పీల్చుకున్నాను.

బావ ఆమెని కుర్చీలో కూర్చోబెట్టాడు. ఇంతలో స్వాతి కూడా ఆయన పక్కకొచ్చింది. తల్లి చీరని సర్దింది. నోటినుంచీ కారుతున్న చొంగని తుడిచి, 'దాని బొంద, అదసలు మళ్ళీ ఈ జన్మలో నీ ముందుకు రాలేదే అమ్మా... నువ్ ధైర్యంగా వుండు. వచ్చినా మేమంతా లేమూ...' అని అనునయించింది.

"అవును.. అవును.. మీరందరూ లేరూ... లేరు... వున్నారు. వున్నారు... అది లేచిపోయినప్పుడూ వున్నారు. అది నా మీదిమీది కొచ్చి చంపేస్తానన్నప్పుడూ వున్నారు" అంటూ "అందరూ దొంగలు... రా" అని నావైపు చూసింది. ఏడుస్తోంది. నేను మాటల్లేకుండా, చేతుల్తో సైగచేశాను అవుననీ, కాదనీ కూడా అర్థమొచ్చేట్టు.

ఆమె మళ్ళీ తనలో తను మాట్లాడుకోవటం, చీరకొంగుని ముడిపెట్టటం, గాలిలో చేతులాడించటం వంటి చేష్టల్లో పడిపోయింది. ఆ గది తలుపువేసి, నిమ్మళంగా మేమంతా హాల్లోకొచ్చాం. నేను కూర్చున్నాను. పాత కథనంతా చెప్పాడు బావ. శకుంతల పరిస్థితిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాను.

ఆమె కూతురి చర్యకి మానసికంగా షాక్‌కి గురయింది. ఆ ఉద్రేకమూ అలజడీ కలిసి సమ స్థితిని తొలగించినై. దిగులూ, ఆందోళనా, దుఃఖమూ కలిసి విచక్షణని కోల్పోయేట్టు చేసినై. ఆ తర్వాత శర్వాణితో తిట్లూ, పోట్లాటలూ, ఆవేశం... వొళ్లంతా పాకినై. శారీరక వ్యవస్థ చెడింది. కూతురు తనని చంపేస్తుందనే భ్రమలో పడింది. దానికి ప్రతిగా తానూ ఆమెను చంపగల ననే ప్రతిచర్యనీ, కసినీ తెచ్చిపెట్టుకుని, తను తాను ధైర్యాన్ని కూడగట్టుకుంటోంది. అందుకనే ఎవరు తన ముందుంటే వారిమీద దాడి చేస్తోంది. అంతేకాదు ఇక్కడి తన వాళ్ళు కూడా తనకు హాని చేస్తారేమోననే భయం, అనుమానం, ఏవేవో భయంకర దృశ్యాలు కనిపిస్తున్న ఫీలింగ్స్....!

అంతా తెలిసీ తెలియని అస్తిమితత్వం, మానసిక అపశ్రుతి!

వంటింట్లో అమ్మమ్మగారు తన వివరాల్ని తాను అందిస్తున్నది. "అసలా పిల్ల మళ్ళీ ఎందుకు రావాలీ, దీన్నిలా పిచ్చిదాన్ని చేసిపోవాలీ? మేం చెబుతుంటే విని చచ్చిందా. అసలే ఈ మొద్దు కుమిలి కుమిలి ఏడుస్తోంది. ఆపైన ఆ శర్వాణీ,దాని మొగుడూ వచ్చి ఒంటికాలిమీద లేచారాయె"

శంకరం బావ అన్నాడు, "శర్వాణికి వ్యతిరేకంగా ఈ యింట్లో ఒక్క శకుంతలే మాట్లాడి రాద్ధాంతం చేసింది. మేమంతా నోట్లో నాలిక వున్నవాళ్ళమే అయినా, , అయిపోయిన పెళ్ళికి బాజాలెందుకని ఊరుకున్నాం. ఈ అమాయక ప్రక్షికి ఆ మాత్రం బుద్ధిలేక దానితో పోట్లాడి పోట్లాడి తనను తాను హింసించుకోవడం మొదలెట్టింది. పోయి పోయి రోగం ముదిరి, మమ్మల్నందర్నీ తిట్టడం, కొట్టడం, లేదంటే అనుమానం. అన్నం పెడితే, ఆ స్వాతి జుట్టుపట్టుకుని కంచం విసిరేసి, "నువ్వూ ఆ తెగించిన దానితో కలిశావే, నాకు విషం పెట్టి చంపేద్దామని చూస్తున్నావా? అమ్మా? నేనేం అంత తొరగా  చావనేవ్. దాన్ని చంపి, నే ఛస్తా..." అంటూ నానా యాగీ చేసింది. అప్పట్నుంచీ ఈ పిల్లా బిక్కుబిక్కుమంటూ తిరుగుతోంది. ఈ సమస్యతో స్వాతి చదువూ సన్నగిల్లుతోంది. అందులోనూ దాని బిటెక్ మూడో ఏడు ఇప్పుడు"

లోపల పెద్దావిడా దబ్బున గోలెత్తుతూనే వుంది. క్షణాల తర్వాత నేను బావని అడిగాను. "అవన్నీ సరేగానీ, మందు సంగతేమిటి? వైద్యులేమంటారు?"

'ఆఁ ఏమంటారు. మొదట్లో చూసిన డాక్టరేమో పెద్దలిస్ట్ రాశాడు. డిప్రెషన్ అంటూ. తెచ్చివేశాం. దానివలన ఒకటే మత్తు. మన్ను తిన్న పాములా పడుండటం. తర్వాతర్వాత మందులు తగ్గించాం. నీ మేనల్లుళ్ళేమో అవన్నీ సెడెటివ్స్ వాడొద్దని గోల.."

ఇంతలో లోపల్నుంచీ పెద్దావిడ అందుకున్నది. "ఏఁవో నాయనా. నా పోరు పడలేక మస్తాన్ సాయిబు దగ్గరకీ తీసుకుపోయారు. ఆయనేదో రసంపోసి, తాయెత్తు కట్టాడు. ఫలితం ఏదీ?"

మా పక్కగా వచ్చి నిలబడింది స్వాతి. తానన్నది, "నాన్నకి జాతకాల పిచ్చి కదా. మృత్యుంజయ శాస్త్రిగారిని  కన్సల్ట్ చేశారు. ఆయనేవో జపాలూ, పూజలూ

చెప్పారు. అవీ అయినై. వేలకి వేలు డబ్బుపోతోంది కానీ, అసలైన వైద్యంలేదు మాంవయ్యా" అని.

నేను తలెత్తి మా బావవైపు చూశాను. "వైద్యం వైద్యం అంటుందీపిల్ల. దీనికేం తెలుసు. వెళ్ళిన ప్రతి హాస్పటల్లోనూ అక్కడే తొంబైటెస్ట్లు చేయించాలి. నిన్న ఎక్కడో చేయించిన అదే టెస్టు ఈయన గారి హాస్పటల్‌లో పనికిరాదు. అంతా కమర్షియలైజేషన్." కొంచెం విసుగ్గా ఘోషించాడు బావ.

'అందుకని వైద్యం వద్దనుకుంటే ఎట్లా... ప్రాణాన్ని గాలిలో పెట్టి వదిలేస్తామా?" స్వాతి. బావ చివాలున తలెత్తి "వదిలెయ్యొద్దు. మన ప్రాణాలు తీసుకుందాం."

స్వాతి తన తండ్రి కోపాన్నీ, డబ్బు బాధనీ, అసహాయతనీ అర్థం చేసుకోగలపిల్లే కదా... తానన్నది "అదిగాదు మావయ్యా పెన్షన్ డబ్బూ, చేతిలో వున్న సొమ్మూ అంతా ఈమె రోగానికే పోతున్నదని నాన్న ఆవేదన. కానీ... " అని ఆగింది.

బావ ఆమెవైపు 'ఇక చాల్లే' అన్నట్లు చూశాడు.

స్వాతి మౌనం వహించింది.

లోపలి పెద్దావిడ అంటున్నది. 'నీ మేనల్లుళ్ళు బుద్ధిమంతులే కానీ రామ్మూర్తీ, పైసా సహాయంలేదు తండ్రికి. కుడుం చేతిలో పెట్టి వుబ్బేసే బాపతు"

"సర్లే... వాళ్ళ జీతాలూ, బతుకులూ ఎంతెంత గొప్పవో మనకు తెలుసుగా?" అన్నది స్వాతి.

ఇంతలో నా దృష్టి శకుంతల వున్న గదిమీదకి మళ్ళింది. అక్కడ ఏదో అలికిడి గమనించాను. లోపలినుంచీ తలుపు సవ్వడి. ప్రశ్నార్థకంగా అటే చూస్తున్నాను. తలుపు సందులో నుంచీ శకుంతల మొహం! నా చూపు స్వాతిని ప్రశ్నించింది- 'ఏమటి?' అన్నట్టు. శంకరం కూడా అటువైపు చూశాడు.

మొహం మీద కొంచెం కలవరపాటుతో అన్నది స్వాతి. "అమ్మే - చూస్తోంది" అని, ఆ వైపు కదులుతూ, "ఆమెకి, ఇంకో సమస్య కూడా వుంది మావయ్యా" అని ఏదో చెప్పబోయింది. శంకరం బావ ఆమెని వారిస్తూ. 'సరేలే.. ఆ రోగాలన్నీ లిస్ట్ పెట్టకు" అన్నాడు విసుగ్గా.

స్వాతి మౌనం వహించి, గదిలోకి వెళ్ళింది.

'మెనోపాజ్ తర్వాతి ప్రాబ్లెమ్స్‌లే' అన్నాడాయన తానామెని వారించినందుకు సంజాయిషీ యిస్తున్నట్టు.

ఆ మధ్యాహ్నమంతా చాలాసేపు శకుంతల గురించే మాట్లాడకున్నాం. సరియైన వైద్యం లేకుండా, ఆమెని ఆ మానసిక అనారోగ్యంలో కొనసాగనివ్వటం మంచిది కాదని కొంచెం గట్టిగానే చెప్పాన్నేను. స్వాతి నాకు మద్దతిచ్చింది. ఫోన్‌లో మాట్లాడితే మా మేనల్లుళ్ళిద్దరూ 'పెద్దవాడివి. అన్నీ తెలిసినవాడివి. నీ యిష్టం" అన్నారు.

నేను సైకియాట్రిస్ట్ దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకున్నాను. ఏటీఎమ్‌లో కొంతడబ్బు తెచ్చుకున్నాను.

ఆ సాయంత్రం సేతుపతి అని ఆ డాక్టర్ దగ్గరికి వెళ్లాం. నేనూ, శంకరం బావా, శకుంతలా, స్వాతీ, దారిలో కూడా మా బావ 'దాని జాతకం ప్రకారం ఈ టైమ్ బాగాలేదు. కొన్నాళ్ళాగితే కులాసా చిక్కుతుంది. ఈ వైద్యమూ, ఖర్చూ అంతా దండగే" అని సణుగుతూనే వున్నాడు.

సేతుపతి ప్రసిద్ధిచెందిన వైద్యుడు. ఏభైఏళ్లుంటాయి. రోగిని చూడగానే – 'స్కిటోఫ్రెనిక్' అని, కొంచెం ముందుగానే తీసుకురాకపోయారా? అన్నాడు.

మేమంతా మొహమొహాలు చూసుకుంటూ కూర్చున్నాం.

శకుంతలని విడిగా ఏవో ప్రశ్నలడిగాడు. స్వాతి కూడా ఆమె పక్కనే వుంది. ఆ తర్వాత నన్నూ, శంకరం బావనీ పిలిచాడు. "మీ చెల్లెలి పరిస్థితిని క్లోజ్‌గా జాగ్రత్త తీసుకోండి. ఈ మందులు చాలాకాలం వాడాల్సి వుంటుంది. నెల నెలా తీసుకురండి. చెకప్‌కి" అని ప్రిస్క్రిప్షన్ అందించాడు.

థ్యాంక్స్ చెప్పి వచ్చేశాం. దారిలో బావ అంత కాలంపాటు ఆ మందుల్ని తినిపిస్తే, పొట్టకీ బుర్రకీ కొత్తజబ్బులు రావటం ఖాయమంటూ సణుగుతూనే వున్నాడు.

నేను రోడ్ పక్కకి నడిచి మెడికల్ షాప్‌కు పోబోతుంటే , వో వయసు మళ్ళిన పెద్దాయన నన్ను ఆపాడు. తన చేతిలో వున్న గొడుగుతో ముందు వెళ్తున్న రిక్షాకేసి చూపుతూ, "నేను చెప్పొచ్చో లేదో తెలీదు సార్. ఆ రిక్షాలో వెళ్తున్న ఆడవాళ్ళు మీ వాళ్ళేనా?" అని అడిగాడు. అవునన్నారు. ఏవిటి విషయం అన్నట్లు ఆయన కళ్ళల్లోకి చూశాను. అప్పుడు చెప్పాడాయన. "ఆ పెద్దావిడకి హెవీగా బ్లీడింగ్ అవుతోంది

బాబూ చీరె తడిసికారుతోంది. పాపం ఆ పిల్ల ఏదో ఆలోచనలో దిక్కులు చూస్తోంది. గమనించలేదల్లే వుంది."

నాకువెన్ను జలదరించింది. మనసు వేగిరపడింది. కాళ్ళూ, చేతులూ చల్లబడినట్లయినై. పక్కగాపోతున్న ఆటోని కేకేసి ఎక్కి అర్జంటుగా రామనామక్షేత్రం పోనిమ్మన్నాను. రిక్షా పోతుంది కానీ, నా గుండె గుబుగుబలాడుతూనే ఉంది.

నేను ఇంట్లోకి వెళ్ళేసరికే, ఇల్లంతా గొడవగా ఉంది. ఒకరిమాట ఒకరికి కాకుండా అందరూ కలిసి ఒకర్నొకరు తప్పులెన్నుకుంటూ అరుచుకుంటున్నారు.

నేను శకుంతల గదిలోకెళ్ళాను. మంచం మీద పడుకుని వుంది. పిచ్చిచూపులు చూస్తూ. సీలింగ్‌ఫాన్ రెక్కల్ని తానే తిప్పుతున్నట్టు చేతుల్ని అభినయిస్తోందామె. ఒణుకుతున్న కాళ్ళతో అక్కడే నిలుచున్నాను. స్వాతి తల్లి చెక్కిళ్ళు నిమురుతూ, లాలనగా ఏమిటో అంటోంది. 'దానికెటూ బుద్ధిలేదు. దీని బుద్ధేమైనట్టు. చూసి చావఖర్లా" శంకరం బావ సుజాత గురించి! "ఏం పాడో రోడ్డుమీద ఏ సినిమా పోస్టర్లమీందుందో దాని ధ్యాస..." బావ వాళ్ళ అత్తయ్య. "అంతేనో ఏ హీరోల మీదో నా...?"

స్వాతి కోపంతో ఊగిపోయింది. "అవును ఎప్పుడూ అదేగా మీ మాట. అక్కని చూసి నేర్చుకుంటానేమోనని. అవును. ఇట్టా రాచిరంపాన పెట్టి దాన్ని మానసికంగా చంపితేనే అమ్మమీద తిరుగుబాటు చేసి లేచిపోయిందిది..."అని ఏడవటం మొదలెట్టింది.

నేను అస్తిమితంగా కూర్చున్నాను. క్షణాలు నిమిషాల్లోకి జారేయి. ఇల్లు సద్దుమణిగింది. నిమ్మళంగా గొంతుపెకల్చాను. "ఇప్పుడేంవిటీ కర్తవ్యం?" అని బావవైపు చూశాను.,

"దానికిటీవల తరచుగా ఇట్టాగే అవుతోంది. ముట్లుడిగే సమయంలో ఇట్టాగే అవుతుందన్నారు. అత్తయ్యే ఏదో గచ్చాకు పుచ్చాకు మందు వేస్తోంది. సర్దుకుంటోంది."

ఏం సర్దుకుంటోంది. నోరులేని పీనిగలా చెప్పుకోలేక యమ బాధ పడుతోంది మామయ్యా. అప్పుడే ఈ అవస్థ మొదలై రెండేళ్ళు దాటింది. నేను డాక్టర్ దగ్గర చూపిద్దామంటే చాలు. నా మీద వొంటికాలుమీద లేస్తారు" స్వాతి తన ఆవేదన తెలిపింది.

మనసున చిక్కని మేఘాలు ముసురుకున్నై నాకు. ఆలోచన కలవరంగా వుంది. భయం కలుగుతోంది. ఆ సమయంలో మళ్ళీ ఆమెని హాస్పటల్‌కి తీసుకువెళ్ళటం ఎట్టా? తెగించి బావతో అన్నాను. "అంబులెన్స్‌కి ఫోన్ చేస్తా. హాస్పటల్‌లో అడ్మిట్ చేద్దాం. అంత హెవీ బ్లీడింగ్‌ని యిగ్నోర్ చేస్తే ఎట్టా?" అని.

లోపలినుంచీ పెద్దావిడ అన్నది. "అంత కంగారేం లేదు రామ్మూర్తీ. ఎప్పుడో ఆ లేడీ డాక్టరెవకో ఇచ్చిన టాబ్లెట్ వేసిందిలే స్వాతి. ఇంక ఆగిపోతంది". "కానీ చూద్దాం" అన్నాడు బావ, ముక్తసరిగా.

నా మనసు మాత్రం శకుంతలని హాస్పటల్‌కి తీసుకుపొమ్మని శాసిస్తోంది. పరిపరి విధాల శంకలు పీడించసాగాయి. బయటికొచ్చి నిలబడివ ముందుగా శర్వాణికి ఫోన్‌లో ఇక్కడి విషయాలు చెప్పాను. ఆమె చాలా బాధపడింది. "వాళ్ల మాటలకేం గానీ, వదినని హాస్పటల్‌కి తీసుకువెళ్ళండి'" అన్నది. ఆ తర్వాత, నా మేనల్లుళ్ళిద్దరికీ ఫోన్ చేశాను ఇంటికి రమ్మని వాళ్ళు వో గంటలోపే ఇంటికి చేరుకున్నారు.

విషయాన్ని అందరికీ సీరియస్‌గానే చెప్పాను. చివరికి అందరూ నా సలహాకి తలలూపారు.

శకుంతలని ఎమర్జెన్సీలో, ఏఎంసీలో చేర్చాము

డాక్టర్లు వాళ్ళ చికిత్సని వాళ్ళు ప్రారంభించారు. ఇంకా కొంత కావలసిన డబ్బుని మళ్ళీ ఏటిఎంలో తీసి హాస్పటల్‌లో డిపాజిట్ చేశాను.

ఆ రాత్రంతా అటు... టెస్టులూ... మందులూ ఇటు మాకు ఆందోళన, ఆవేదన

మర్నాడు డాక్టర్ రోగ నిర్ణయాన్ని తెలియజేశాడు. గర్భసంచిలో గడ్డలున్నాయని వాటి వివరాల్నీ విశదంగానే చెప్పాడు. నేనూ, మా బావా, పిల్లలూ అందరమూ వున్నాము. విన్నాం. ఆ వెంటనే, డాక్టర్ చెప్పాడు. "మీరు ఆమె ఆరోగ్యం గురించి అసలు పట్టించుకున్నట్టు లేదు. కేసు బాగా ఆందోళనకరంగా ఉంది. రేపు బయాప్సీ చేయిస్తాం. రిజల్ట్ రావటానికి వారం పదిరోజులు పడుతుంది."

బయాప్సీ అనగానే నాకెందుకో గుండెలో దిగులు రేగింది. భయం భయంగా గుండె అదిరింది. ఆ రాత్రి మా వాళ్లందరూ మరీ గుచ్చి గుచ్చి అడుగుతుంటే చెప్పేశాను. అది క్యాన్సర్ అవునోకాదో నిర్ధారించే పరీక్ష అని. నేను ఆ మాట

చెప్పగానే అంది మోహల్నీ విషాదం అలముకుంది. నేనే ధైర్యం చెప్పాను. "ఎందుకంత కంగారు. టెస్ట్ రిజల్ట్ తెలియాలిగా" అని.

శర్వాణికీ, సూరికీ ఇక్కడి విషయం చెప్పాను. ఆ రాత్రికే తాను బయల్దేరి గుంటూరు వస్తానన్నది శర్వాణి.

నేనూ సరే అన్నాను.

❖ ❖ ❖

వారం రోజుల తర్వాత శకుంతల ఇంటికొచ్చింది.

ఆ తర్వాత రెండు రోజులకి బయాప్పీ రిజల్ట్ వచ్చింది. మేలిగ్నెన్సీని నిర్ధారించారు. అటూ ఇటూ అయిన వారంతా చేష్టలు దక్కి నిలిచారు. అందరికీ బాధా,విచారం!

శకుంతలకి వైద్యం జరుగుతోంది.

❖ ❖ ❖

అవివేకం, నిర్లక్ష్యం, ఉదాసీనత, తప్పుడు ఆలోచనలూ, తప్పుడు నిర్ణయాలూ... అనారోగ్యం గురించీ రోగాల గురించీ.. మనల్ని ఎక్కడికి నడుపుతాయో.....? చికిత్సకంటే నివారణ ఎప్పుడూ వాంఛనీయమే కదా?!

సందర్భమూ, సన్నివేశమూ – సంకల్పం మీదే ఆధారపడి ఉంటాయి. బావా, అమ్మమ్మగారూ, నా మేనల్లుళ్ళూ అందరూ అపరాధ భావనలో గుడ్లు మిటకరిస్తున్నారు.

❖ ❖ ❖

నేనూ శర్వాణీ మళ్ళీ ఎప్పుడు గుంటూరు వెళ్ళి రావాలా అని ఆలోచిస్తున్నాం. స్వాతికి సూరి ఫోన్ చేసి చెప్పాడుట. "అత్తయ్య వైద్యం ఖర్చు గురించి మీరు దిగులుపడకండి, మేమున్నాం కదా" అని!

ఈ సంగతి తెలిసి, శర్వాణీ నేనూ సంతృప్తిగా ఒకర్నొకరు చూసుకుని కళ్ళు చికిలించుకున్నాం.

శకుంతల ప్రయాణం రెండు పడవల మీదా సాగుతూనే ఉంది. గమ్యం కంటికానడం లేదు!

❖